క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా హరిప్రసాద్ రెడ్డి



గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా హరిప్రసాద్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గత కొంతకాలంగా ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉన్న రాఘవేంద్ర రాజు బదిలీ కావడంతో హరిప్రసాద్ రెడ్డి ఆ స్థానంలోకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాల మేరకు ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుని మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణ కుమారి

పాలసముద్రం : భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ అరుణ కుమారి సిబ్బందితో సమీక్షించారు. కొండ ప్రాంతాలకు సమీపంలో ఉన్న వనదుర్గాపురం, మణిపురం ఎస్టీ కాలనీల్లో పర్యటించారు. ప్రస్తుతం ఏర్పడిన అల్పపీడనం వల్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పూరిగుడిసెల్లో ఉండేవారు వాటిని వదలి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తెలిపారు. అత్యవసరం అయితే 9491077033 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే థామస్

కార్వేటినగరం: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. సోమవారం ఆయన పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని అల్లాగుంట, శెట్టిగుంట ఎస్టీకాలనీ, అలాగే పద్మసరస్సు జగనన్న కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. జగనన్న కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.74 లక్షలు వెచ్చించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, తహసీల్దార్ భగవతి, ఈఓ నాగరత్నమ్మ, జనసేన ఇన్‌చార్జ్ యుగంధర్, మండల అధ్యక్షుడు చెంగల్రాయలు యాదవ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం: రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు గౌరవ జిల్లా కలెక్టరు జారీ చేసిన సూచనలు మేరకు సోమవారం మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన సిమెంట్ రోడ్డు పనులు విలాస విరహాపురం గ్రామ పంచాయతీలో, ఉడుమలకుర్తి పంచాయతీల్లో మురుగు కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అధికారులు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, వార్డు మెంబర్లు, హాజరయ్యారు.

విధులకు డుమ్మా కొట్టడంలో బెస్ట్



ఖాళీగా ఉన్న టైపిస్టు కుర్చీ

విజయపురం: మండల కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న టైపిస్టు విధులకు డుమ్మా కొట్టడంలో బెస్ట్ అనిపించుకుంటున్నాడు. కార్యాలయంలో అందుబాటులో ఉండాల్సిన టైపిస్టు తరచూ విధులకు డుమ్మా కొటుతున్నాడన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం 12 గంటలవుతున్నా టైపిస్టు విధుల్లో కనిపించ లేదు. సమాచారం కోసం వచ్చే ప్రజాప్రతినిధులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి

శ్రీరంగరాజపురం : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం కారణంగా మండల వ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లోకనాథ అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏదైనా ఇబ్బంది కలిగితే 9491077028 నంబరులో సంప్రదించాలన్నారు.

పెనుమూరు నర్సరీల హబ్

మేలు రకమైన కూరగాయల పంటల సాగుకు అవసరమైన నారు పెనుమూరు మండలంలో లభిస్తోంది. జిల్లాలో మరెక్కడా లేనివిధంగా మండలంలో 13 నర్సరీలు నిర్వహణలో ఉన్నాయి. అయితే నర్సరీలను నిర్వహించేది రైతులే కావడంతో నాణ్యమైన నార దొరుకుతుంది. మిరపతో పాటు వివిధ రకాల మొక్కల నారును కూడా అందిస్తున్నారు. రైతులకు ఇక్కడ అన్ని ప్రముఖ కంపెనీలకు చెందిన హైబ్రిడ్ మిర్చి నారు ఒకే చోట దొరుకుతుంది. దీంతో జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన రైతులు పెనుమూరు నర్సరీలో పెంచుతున్న మిరపనారు కొనుగోలుకు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

- నాణ్యమైన మిర్చి నారుకు కేరాఫ్‌గా నిలుస్తున్న నర్సరీలు
- నిర్వాహకులు సైతం రైతులే
- అందుబాటులో అన్ని రకాల హైబ్రిడ్ మొక్కలు
- నారు కోసం క్యూ కడుతున్న రైతులు
- వందలాది మందికి ఉపాధి



నాణ్యమైన చామంతి మొక్కలను పరిశీలిస్తున్న రైతులు

కార్వేటినగరం: నిత్యం అవసరమయ్యేవి కూరగాయలు. ప్రస్తుత తరుణంలో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ నేపథ్యంలో కూరగాయల పంటల సాగకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పెనుమూరు మండలంలో రైతులే నర్సరీలు నిర్వహిస్తుండడంతో చాలామంది రైతులు అక్కడికి వెళ్లి నాణ్యమైన కూరగాయల పంటల సాగుకు నారు తెచ్చుకుంటున్నారు. అలాగే ఈ ప్రాంతానికే ప్రత్యేకంగా నిలిచే మిర్చి పంటకు ఇక్కడ గుర్తింపు ఉంది. ఇప్పుడు నర్సరీల ద్వారా అనేక ప్రాంతాలకు మేలు రకమైన మిర్చినారును సరఫరా చేసేందుకు కేంద్రంగా మారింది. అదేవిధంగా బంతి, చామంతి, కనకాంబరాలు, వంగ, ఉల్లి వంటి నాణ్యమైన వంగడాలు కూడా అందుబాటులో ఉంటాయి.

రైతులే నిర్వాహకులు కావడంతో..

గతంలో మిర్చి పంట పండించిన రైతులు మళ్లీ పంట సాగుకు నారు సాగు పోసుకునేవారు. ఇటీవల నారు కోసం రైతుల తాకిడి అధికం కావడంతో పాటు ఉద్యానశాఖ అధికారులు ఇక్కడి రైతులకు అవగాహన కల్పించి మరిన్ని నర్సరీలు ఏర్పాటు చేయించారు. మండలంలో మొత్తం 13 నర్సరీలు నిర్వహణలో ఉండగా, ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 200 మందికి పైగా ఉపాధి లభిస్తోంది. లాభాపేక్ష లేకుండా రైతులకు నాణ్యమైన నారును అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులు, చీడపీడలను తట్టుకునే కొత్త రకం మిర్చి వంగడాల విత్తనాలు తెచ్చి నారు పెంచుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.



నర్సరీలో ఏపుగా పెరిగిన మిరపనారు

అనుభవం ఉంది గనుక..



నాకు వ్యవసాయం చేసిన అనుభవం ఉంది. 12 ఏళ్ల కిందట ఇక్కడ 5 ఎకరాల్లో నర్సరీలు ఏర్పాటు చేశాం. సుమారు రూ.9 లక్షలు పెట్టుబడి అయింది. నర్సరీలు ఎక్కువ కావడంతో కొంత డిమాండ్ తగ్గింది. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో మిర్చి పంటకు గిట్టుబాటు కూడా లేకపోవడంతో రైతులు పంటను సాగుచేయడానికి గతంలో లాగా ముందుకు రావడం లేదు. ఈ ఏడాది నర్సరీ పరిస్థితి అంతంత మాత్రమే. – ఎస్.వీరభద్ర, నర్సరీ యజమాని, గాంధీపురం, పెనుమూరు

రైతుల ఆదరణ



నర్సరీల నిర్వాహకులు మిరప నారు చాలా నాణ్యతతో ఉంటుంది. గత 15 ఏళ్లుగా ఈ ప్రాంతంలో దొరికే నారు కోసం ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు నమ్మకంతో వస్తున్నారు. అన్ని రకాలైన హైబ్రిడ్ మిరప నారు మా వద్ద అందుబాటులో ఉంటుంది. ఈ ఏడాది మిర్చి నారుకు పలు రకాల తెగుళ్ల సోకడంతో నర్సరీల నిర్వాహణకు ఖర్చు బాగా పెరిగింది. – పి.గుణశేఖర్, యజమాని, రామకృష్ణాపుర, పెనుమూరు

నిర్వాహకులు రైతులే కావడంతో..



పెనుమూరులో తక్కువ ఖర్చుతో మేలు రకమైన నారు దొరుకుతుంది. ఇక్కడ ఎక్కువ నర్సరీలు ఉండడంతో రెండు మూడు మేలు రకాలైన హైబ్రిడ్ మిర్చి నారును కొనుగోలు చేసుకునే అవకాశం ఉంది. అందుకే సుమారు 5 ఏళ్లుగా ఏటా ఇక్కడికి వచ్చి మిర్చినారు కొనుగోలు చేస్తున్నాం. నిర్వాహకులు రైతులే కావడంతో మాకు నమ్మకం.– నారాయణస్వామి, రైతు, పొదలకొండ, పెనుమూరు

నేడు ప్రదోషకాల పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరి కొలువైన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రమేష్ సోమవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. ఏక కాలంలో నందీశ్వరునికి, శివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరుగుతాయని తెలిపారు.

కొండమల్లీశ్వరునికి అభిషేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండ మల్లీశ్వరునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి, అదేవిధంగా చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో అభిషేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో గ్రూపు రాజకీయం



ఎంపీడీపీఓ కార్యాలయం

విజయపురం: అధికారులు కూడా గ్రూపు రాజకీయం చేయడం విజయపురం మండల కార్యాలయంలో చోటు చేసుకుంది. విజయపురం మండలంలో ఓ కులానికి చెందిన నాయకుడు తన కులానికి చెందిన ఓ అధికారిని నియమించుకున్నాడు. తాను ఏంచెబితే అదే చేస్తూ కింద స్థాయి సిబ్బందిని తీవ్రంగా వేధిస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా కారణం లేకుండా మెమో ఇస్తానని బెదిరిస్తూ, మానసిక వేదనకు గురి చేస్తున్నారన్న కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పని చేసుకుంటేనే అభివృద్ధి ముందుకు సాగుతుంది. అలా కాకుండా రాజకీయ నాయకుడు చెప్పినట్లు వ్యవహరిస్తూ, కింద స్థాయి అధికారులకు నిత్యం వేధింపులకు గురి చేయడం ఎంత వరకు న్యాయమని ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గుండెపోటుతో బస్సు కండక్టర్ మృతి



మృతి చెందిన కుప్పయ్య

తిరుత్తణి: ప్రభుత్వ బస్సు కండక్టర్ విధుల్లో ఉంటూ హఠాన్మరణం చెందిన ఘటన తిరుత్తణిలో సోమవారం చోటుచేసుకుంది. పళ్లిపట్టు సమీపంలోని వెంకటరాజుకుప్పం గ్రామానికి చెందిన కుప్పయ్య(52) ప్రభుత్వ బస్సు కండెక్టర్. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా నగరిలో భార్య ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నాడు. పొదటూరుపేట ప్రభుత్వ బస్సు డిపోకు చెందిన టౌన్ బస్సు రూట్ నెంబర్ 27 సోమవారం ఉదయం తిరుత్తణి నుంచి కోణసముద్రానికి ప్రయాణిస్తుండగా కండెక్టర్ కుప్పయ్య ప్రయాణికులకు టికెట్ ఇస్తూ అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలి బస్సులో పడిపోయాడు. వెంటనే 108లో కుప్పయ్యను తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ అతన్ని పరీక్షించిన వైద్యులు కుప్పయ్య మార్గం మధ్యలోనే గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. తిరుత్తణి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న దౌర్జన్యం

- నవరత్నాల బోర్డు తొలగింపు



నవరత్నాల పలకను తొలగించిన దృశ్యం

విజయపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టాక ఎక్కడ చూసిన దౌర్జన్యం, అరాచకాలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు విజయపురం మండలంలో టీడీపీ అరాచకాలకు హద్దు అదుపు లేకపోతున్నాయని ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇటీవల కలియంబాకం సచివాలయంలో శిలాఫలకంపై ఓ టీడీపీ కార్యకర్త నల్ల రంగు కొట్టడం వివాదాస్పదంగా మారింది. ఆ సంఘటన మరవక ముందే కోసలనగరం సచివాలయం గోడపై ఉన్న నవరత్నాల పలకను టీడీపీ నాయకులు తొలగించడం వివాదాస్పదంగా మారింది.

టీడీపీ నాయకుల అరాచకం

కోసలనగరం సచివాలయంపై ఉన్న నవరత్నాల బోర్డునే వెంటనే తొలగించాలని ఓ స్థానిక నాయకుడు సిబ్బందిపై గత కొన్ని రోజులుగా ఒత్తిడికి గురి చేశారు. అయితే వారు వాటిని ఏ మాత్రం పట్టించుకోలేదు. ఇటీవల దసరా సెలవులో ఉండగా కొందరు టీడీపీ నాయకులు రాత్రికి రాత్రే వాటిని తొలగించేశారు. అయితే సచివాలయ సిబ్బంది తొలగించారని ప్రచారం చేశారు. అయితే తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పుకొస్తున్నారు.

దుమ్మెత్తి పోస్తున్న ప్రజలు

కోసలనగరం సచివాలయంపై ఉన్న నవరత్నాల పలకను తొలగడంపై స్థానిక ప్రజలు దుమ్మెతిపోతున్నారు. ఈ సంఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి ఘటనలు గ్రామాల్లో ఘర్షణలకు దారి తీస్తాయని అన్నారు. గత ఐదేళ్లలో వైఎస్ఆర్ సీపీ కులాలకు అతీతంగా పథకాలు అందించింది. ఇందులో టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు సైతం ఉన్నారని గుర్తు చేశారు. ఇలాంటి సంఘటనకు కారణమైన వారిని గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకుండా రోడ్డుపై ధర్నా చేయడానికి వెనుకాడమని స్థానిక ప్రజలు హెచ్చరించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా ఈ సంఘటన జరిగిందని తనకు తెలియదని, తాను సెలవులో ఉన్నానని, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నగరి: వాతావరణ శాఖ భారీ వర్ష హెచ్చరికలు చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మున్సిపల్, మండలస్థాయి అధికారులతో సమావేశమయ్యారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశమైన ఆయన భారీ వర్షాలు రానున్నాయన్న హెచ్చరికలతో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ సతీష్, సీఐ మహేశ్వర్, ట్రాన్స్‌కో డీఈ వెంకటముని, హౌసింగ్ డీఈ శంకరప్ప, మున్సిపల్ డీఈ రవీంద్రారెడ్డి, టీపీఓ, ఏఈలు, డీటీ, ఆర్ఐలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ



వనదుర్గాపురం సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం : మండల పరిధిలోని సచివాలయ ఉద్యోగులు వర్షాల సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. సోమవారం ఆమె వనదుర్గాపురం, పాలసముద్రం, కృష్ణజమ్మపురం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. తుపాన్ ప్రభావం వల్ల ఎలాంటి ప్రభావం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో మంజూరైన ఇంటి నిర్మాణ పనులను పూర్తి చేయించాలని సూచించారు. అనంతరం మూమెంట్, ఇతర రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నగరి: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణ నిమిత్తం ఉచిత బోధన, భోజన, వసతి సౌకర్యాలతో మూడు నెలలపాటు శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా సంక్షేమ, సాధికార అధికారి డాక్టర్ జి.రాజ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ శిక్షణ పొందేందుకు టెట్ అర్హత కలిగి, వార్షికాదాయం రూ.2.5 లక్షల్లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 11 నుండి 21వ తేదీ లోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ ఈ నెల 27వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష నిర్వహించి, అర్హులైన అభ్యర్థులను మెరిట్ లిస్ట్ ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.జ్ఞానభూమి.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్ సైట్ ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మద్యం షాపులు వీరివే...



సీఐ మురళీమోహన్

పుత్తూరు: పుత్తూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 18 మద్యం షాపుల కోసం 230 మంది లాటరీలో పోటీ పడ్డారు. సోమవారం ఉదయం 8 గంటలకు తిరుపతిలోని శిల్పారామం అర్బన్ హట్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో డ్రా తీశారు. పుత్తూరు ఎక్సైజ్ సీఐ మురళీ మోహన్ లాటరీలో షాపులు పొందిన వారి వివరాలను మీడియాకు తెలిపారు. పుత్తూరు మండలంలోని 7 షాపులను బీఆర్ హరికృష్ణ, కె.దేవరాజులు, ఎస్ దిలీప్‌కుమార్, ఎం.శ్రీనివాసులు, కె.దేవరాజులు, ఎస్.పద్మనాభం, పి.జగదీష్ దక్కించుకున్నారని తెలిపారు. నారాయణవనం 3 షాపులను ఎం.భరత్‌కుమార్, ధర్మరాజు, జి.ధర్మయ్య, రామచంద్రాపురం 4 షాపులను టి.స్వాతి, కె.హరిప్రసాద్, టి.మోహన్‌రెడ్డి, వి.తులసీరామ్, వడమాలపేట 4 షాపులను పి.రామ్‌మోహన్‌రెడ్డి, ఎస్.వరలక్ష్మి, ఎస్.లక్ష్మీమోనిక, యు.నాగరాజు దక్కించుకున్నట్లు వివరించారు. పుత్తూరులో షాపులు దక్కించుకున్నవారు లైసెన్స్ ఫీజు కింద తొలి ఏడాది రూ.65 లక్షలు, ఇతర మండలాలకు చెందిన వారు రూ.55 లక్షలను ఆరు కంతుల్లో చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ నెల 16 నుంచి వీరు షాపులను నడుపుకోవచ్చునని తెలిపారు.

అయ్యయ్యో.. జేబులు ఖాళీ ఆయెనే...

- ముగిసిన మద్యం లాటరీ
- ప్రభుత్వానికి రూ.9.16 కోట్ల ఆదాయం
- లక్కు లేక పోగొట్టుకున్న సొమ్ము రూ.8.58 కోట్లు



వైన్ షాపు

నగరి: అయ్యయ్యో జేబులు ఖాళీ ఆయెనే.. అనే సినిమా పాటలా తయారైంది మద్యం వ్యాపారస్తుల పరిస్థితి. లాటరీలో షాపులు రాకపోవడంతో దరఖాస్తుకు కట్టిన రూ.2 లక్షలు ప్రభుత్వ హుండీలో వేసినట్లయింది. నియోజకవర్గంలోని నగరి ఎక్సైజ్ పరిధిలోని 11 షాపులకు 221 దరఖాస్తులు రాగా పుత్తూరు ఎక్సైజ్ పరిధిలోని 18 షాపులకు 237 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 29 షాపులకు 458 దరఖాస్తులు రాగా రూ.9.16 కోట్లు దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి వచ్చింది. ఇందులో ఒక్కొక్కరే 5 నుంచి 20 దరఖాస్తులు చేసుకున్నవారున్నారు. వీరి భవితవ్యం సోమవారం తేలిపోయింది. లాటరీలో 29 మందికి దుకాణాలు రాగా మిగిలిన 429 దరఖాస్తులకు చెల్లించిన సొమ్ము రూ.8.58 కోట్లు లక్కు లేక ప్రభుత్వానికి వదిలేసినట్లయింది.

మద్యం పరవళ్లు

షాపులు పెట్టుకోవడానికి వార్డు పరిధి లేదని ఎక్కడైనా పెట్టుకోవచ్చన్న నిబంధన ప్రభుత్వం పెట్టడంతో షాపులు చేజిక్కించుకున్నవాళ్లు ఎక్కడ షాపులు పెట్టాలన్న అంశంపై తనిఖీలు ప్రారంభించారు. ఈ నెల 16 నుంచి వ్యాపారాలు ప్రారంభించాల్సి ఉండడంతో ఎక్కడ పెడితే వ్యాపారం బాగా జరుగుతుందన్న అంశంపై తీవ్రస్థాయిలో ఆరా తీస్తున్నారు. మరోవైపు 24 గంటల్లో లైసెన్సు ఫీజుకు సంబంధిత ఒక ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించాల్సి ఉండడంతో షాపులు దక్కించుకున్న వారు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు.

నిబంధనలు పాటించాల్సిందే...

షాపులు వచ్చినవారు విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలకు వంద మీటర్ల లోపు మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదు. జాతీయ రహదారి, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల దూరంలో షాపులు ఏర్పాటు చేయాలి. హైవేలపై మద్యం దుకాణం ఉందని తెలియజేసే ఏవిధమైన సైన్ బోర్డులు, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయకూడదు. మండలం కేంద్రంలో 20 వేల కంటే తక్కువ జనాభా ఉంటే స్టేట్ హైవేలకు 220 మీటర్ల దూరంలో మద్యం దుకాణం పెట్టుకోవచ్చు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే విక్రయించాలి. బార్‌లకు ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు అనుమతి ఉంది.

పైకప్పు కూలిన భవనం తొలగించండి



పైకప్పు కూలిన తరగతి గదిని పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ ఈఈ మధుసూదన రావు

పాలసముద్రం : మండలంలోని శ్రీబొమ్మరాజుపురం ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదిలో పైకప్పు కూలిపోవడంతో సంఘటన స్థలాన్ని ఎస్ఎస్ఏ ఈఈ మధుసూదన రావు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్కూల్ భవనం శిథిలావస్థకు చేరిందని, ఇలాంటి భవనాలను గుర్తించి గ్రామ ప్రజలు, పిల్లలు లోపలకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, పైకప్పు కూలిన భవనాన్ని జేసీబీ సాయంతో పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. కొత్త భవనం మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఆయన వెంట ఎంఈఓ రాజేంద్రప్రసాద్, టీచర్ వెంకటేష్ ఉన్నారు.

రోడ్లు అధ్వానం.. ఎలా ప్రయాణం ?

- వర్షానికి అధ్వానంగా మారిన రోడ్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

పాలసముద్రం : మండలకేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. వర్షానికి రోడ్లలో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా మండలంలోని బలిజకండ్రిగ–చిత్తూరు జాతీయ రహదారిలోని ఏట్టుకూరిపల్లె సమీపంలో రోడ్డు బాగా దెబ్బతినడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షం పడితే రోడ్డులోనే నీరు నిలిచిపోతోంది. దీంతో రోడ్డులో గుంత ఎక్కడ ఉందో తెలియక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అలాగే బలిజకండ్రిగ–చిత్తూరుకు ప్రతి 30 నిమిషాలకు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. బెంగళూరుకు ఆరు బస్సు సర్వీసులు కూడా ఉన్నాయి. రాత్రి పూట ద్విచక్రవాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించబోయి.. గుంతల్లో పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. కన్నికాపురం సమీపంలో వర్షపు నీరు రోడ్డుపై నీరు నిలిచి పెద్ద గుంత అయిపోయి చెరువల తలపిస్తున్నాయి.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం..

గతంలో తుపాన్ ప్రభావంతో రోడ్లపై వర్షపు నీరు నిలిస్తే గంగాధరనెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ యుగంధర్ వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చింది.. మరి రోడ్లు ఎందుకు బాగు చేయలేదు ? ఇప్పుడు ఇదే రోడ్డులో నిలిచిన వర్షపు నీటిలో తాము వరి నాట్లు వేయాలా ? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



వర్షానికి గుంతలమయంగా మారిన రోడ్డు



ఏట్టుకూరిపల్లె సమీపంలో వర్షానికి చెవులా మారిన రోడ్డు

బాధ్యతల స్వీకరణ

గంగాధర నెల్లూరు : మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఏకాంబరం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్ఐగా పని చేస్తున్న దేవి బదిలీపై వెళ్లగా వెదురుకుప్పం మండలం నుంచి ఏకాంబరం బదిలీపై జీడీ నెల్లూరుకు వచ్చారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా ఈశ్వర్

ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏఈగా ఈశ్వర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఈగా పని చేస్తున్న గాయత్రి బదిలీపై వెదురుకుప్పం వెళ్లారు. ఆమె స్థానంలో తవణంపల్లిలో పనిచేస్తున్న ఈశ్వర్ బదిలీపై వచ్చారు.



ఆర్ఐ ఏకాంబరం



ఏఈ ఈశ్వర్